పోలియో రహిత సమాజ స్థాపనే ధ్యేయం

వైఎస్సార్ సీపీ పొన్నూరు సమన్వయకర్త అంబటి మురళీ కృష్ణ

పొన్నూరు: పోలియో రహిత సమాజాన్ని స్థాపించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వైఎస్సార్ సీపీ పొన్నూరు సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ తెలిపారు. ఐదు సంవత్సరాలలోపు పిల్లలకు తప్పకుండా పోలియో చుక్కలు వేయించాలని సూచించారు. ఆదివారం పట్టణంలోని గుంటూరు బస్‌స్టాప్ సెంటర్‌లో శిబిరాన్ని ప్రారంభించారు. చిన్నారులకు పోలియో చుక్కలు వేసి, వైద్య సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు షేక్ నాజర్, కోటా శ్రీనివాసరావు, ఆశా కార్యకర్తలు, ఏఎన్‌ఎంలు, పాల్గొన్నారు.

మదర్సా అభివృద్ధికి కృషి

పట్టణంలోని ముఫ్తీ అబ్దుల్లా మదర్సాను వైఎస్సార్ సీపీ పొన్నూరు సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ సందర్శించారు. విద్యార్థులకు కావాల్సిన వసతుల్ని అడిగి తెలుసుకున్నారు. మదర్సా అభివృద్ధికి చేపట్టాల్సిన పనులపై నిర్వాహకులతో చర్చించారు. ఈ సందర్భంగా మురళీకృష్ణ మాట్లాడుతూ సీఎం వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ముస్లింల అభ్యున్నతికి అనేక సంక్షేమ పథకాలు అమలు చేశారని తెలిపారు. ముస్లింలకు ఎప్పుడూ అండగా ఉంటానని పేర్కొన్నారు. మదర్సా అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. అనంతరం ఆయన్ను నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు షేక్ నాజర్, వడ్రాణం ప్రసాద్, అంజిరెడ్డి, కొండముది శంకర్రావు, కోటా శ్రీనివాసరావు, కార్యకర్తలు పాల్గొన్నారు.

● నాలుగో వార్డులో సచివాలయం వద్ద మాజీ కౌన్సిలర్ షేక్ షర్మిల, 16వ వార్డులో వైఎస్సార్ సీపీ వార్డు నాయకులు దేవరకొండ గోపీ పోలియో చుక్కలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. మండలంలోని మామిళ్లపల్లిలో సర్పంచ్ జాలాది యానాదిరావు, వెల్లలూరులో సర్పంచ్ ఇక్కుర్తి మల్లికార్జునరావు పిల్లలకు పోలియో చుక్కలను వేశారు.

పోలియో మహమ్మారిని తరిమికొట్టాలి

గుంటూరు రూరల్: తల్లిదండ్రులంతా చిన్నారులకు పోలియో చుక్కలు వేయించి, మహమ్మారిని తరిమికొట్టాలని రూరల్ మండలం ఎంపీపీ ఇంటూరి పద్మావతి తెలిపారు. ఆదివారం మండలంలోని వెంగళాయపాలెం, తురకపాలెం, చల్లావారిపాలెం గ్రామాల్లో చిన్నారులకు పోలియో చుక్కల కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ తల్లిదండ్రులంతా అశ్రద్ధ చేయించకుండా చిన్నారులకు పోలియో చుక్కలు వేయించాలని తెలిపారు. కార్యక్రమంలో వైద్య, ఆరోగ్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

● పోలియోను సమూలంగా నిర్మూలన చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం పోలియో చుక్కల కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని ప్రత్తిపాడు వ్యవసాయ మార్కెట్ యార్డ్ చైర్మన్ ఆళ్ల రవిదేవరాజు తెలిపారు. ఆదివారం ఏటుకూరులో పల్స్ పోలియో కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో వైద్య, ఆరోగ్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

రెండు చుక్కలతో చిన్నారులకు నిండు జీవితం

ప్రత్తిపాడు: రెండు చుక్కలతో చిన్నారులకు నిండు జీవితం లభిస్తుందని ప్రత్తిపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ దివ్యమేఘన అన్నారు. మండలంలో వైద్య, ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో పల్స్‌పోలియో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఐదేళ్లలోపు చిన్నారులకు ప్రత్తిపాడు పీహెచ్‌సీలో డాక్టర్ దివ్యమేఘన, గొట్టిపాడు పీహెచ్‌సీలో డాక్టర్ మేరియునిస్, కొండేపాడులో సర్పంచ్ నర్రా రాంబాబు, ప్రత్తిపాడు ఉప సర్పంచ్ బాపతు వెంకటేశ్వరరెడ్డి, నడింపాలెంలో సర్పంచ్ లాం రత్నకుమార్, వట్టిచెరుకూరులో జెడ్పీటీసీ సభ్యురాలు భీమినేని వెంకటలక్ష్మి, కుర్నూతలలో సర్పంచ్ యర్రాకుల గోపాలకృష్ణ, పుల్లడిగుంటలో సర్పంచ్ పర్వీన్ సుల్తానా పోలియో చుక్కలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. యనమదల, నడింపాలెం, ప్రత్తిపాడు, ఈదులపాలెం గ్రామాల్లో పల్స్‌పోలియో కార్యక్రమాన్ని వైద్యాధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా దివ్యమేఘన మాట్లాడుతూ ఐదు ఏళ్లలోపు చిన్నారులందరికీ కచ్చితంగా తల్లిదండ్రులు పోలియో చుక్కలు వేయించాలని సూచించారు.

నేడు, రేపు డోర్ టు డోర్

పల్స్‌పోలియో కార్యక్రమంలో భాగంగా సోమ, మంగళవారాల్లో ఆరోగ్య సిబ్బంది ఇంటింటికీ తిరిగి పల్స్‌పోలియో చుక్కలు వేయనున్నారని వైద్యాధికారి డాక్టర్ మేరియునిస్ తెలిపారు. మండలంలోని రెండు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో మొత్తం 3,209 మంది 5 సంవత్సరాల చిన్నారులు ఉన్నారని, వారిలో తొలిరోజు 3,124 మందికి పల్స్ పోలియో చుక్కలు వేశామన్నారు. మిగిలిన వారికి సోమ, మంగళవారాల్లో వేస్తామని, తల్లిదండ్రులు సహకరించాలని మేరియునిస్ కోరారు.


చిన్నారికి పోలియో చుక్కలు వేస్తున్న అంబటి మురళీకృష్ణ


మామిళ్లపల్లిలో పోలియో చుక్కలు వేస్తున్న సర్పంచ్ యానాదిరావు


కాకుమానులో చిన్నారికి పోలియో చుక్కలు వేస్తున్న జెడ్పీటీసీ సభ్యురాలు గుల్జార్ బేగం

కాకుమానులో..

చిన్నారుల నిండు జీవితానికి తల్లిదండ్రులు రెండు పోలియో చుక్కలు వేయించాలని కాకుమాను జెడ్పీటీసీ సభ్యురాలు షేక్ ముజావర్ గుల్జార్ బేగం సూచించారు. మండలంలోని గ్రామాల్లో ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఆదివారం పల్స్ పోలియో కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న గుల్జార్ బేగం మాట్లాడుతూ పోలియో రహిత గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు సమాజంలో ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఆమె కోరారు.ఈ సందర్భంగా కాకుమాను ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో 1690 మంది చిన్నారులు ఉండగా వారిలో 96 శాతం మందికి చుక్కలు వేసినట్లు డాక్టర్ రవిప్రసాద్ తెలిపారు. మిగిలిన వారికి సోమ,మంగళవారాల్లో సిబ్బంది ఇంటింటికీ వెళ్లి పోలియో చుక్కలు వేయనున్నట్లు ఆయన చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ పసుపులేటి శివకుమారి, ముజావర్ షేక్ అసదుల్లా, సిబ్బంది పాల్గొన్నారు.


వెల్లలూరులో పిల్లలకు పోలియో చుక్కలు వేస్తున్న సర్పంచ్ మల్లికార్జునరావు


వెంగళాయపాలెంలో చుక్కలు వేస్తున్న ఎంపీపీ పద్మావతి


ఏటుకూరులో పోలియో చుక్కలు వేస్తున్న యార్డ్ చైర్మన్ రవిదేవరాజు


ప్రత్తిపాడు పీహెచ్‌సీలో చిన్నారులకు పల్స్‌పోలియో చుక్కలు వేస్తున్న వైద్యాధికారి దివ్యమేఘన

క్లుప్తంగా

విద్యార్థి దశ నుంచే పుస్తక పఠనం అవసరం




పెదనందిపాడు(కాకుమాను): విద్యార్థి దశ నుంచే ప్రతి ఒక్కరూ పుస్తక పఠనంపై ఆసక్తి పెంపొందించుకోవాలని ఎస్టీయూ రాష్ట్ర కౌన్సిలర్ గేరా మోహనరావు అన్నారు. పెదనందిపాడు శాఖా గ్రంథాలయంలో ఆదివారం 'చదవడం అంటే మా కిష్టం' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గేరా మాట్లాడుతూ పుస్తక పఠనంతో విషయ పరిజ్ఞానంతో పాటు ప్రపంచ జ్ఞానం పెంపొందుతుందని తెలిపారు. ప్రతి విద్యార్థి ప్రతి రోజు గంట సమయాన్ని గ్రంథాలయానికి కేటాయించి మంచి పుస్తకాలను చదువుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారిణి పి.సుభాషిణి, విశ్రాంత ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చెరువు శంకుస్థాపనను అడ్డుకున్న టీడీపీ నేతలు

గుంటూరు రూరల్: మండలంలోని తోకావారిపాలెంలో తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు ప్రభుత్వ భూమిలో శంకుస్థాపన కార్యక్రమాన్ని స్థానిక టీడీపీ నాయకులు, ప్రజలు ఆదివారం అడ్డుకున్నారు. సర్వే నంబర్ 32లో 4–47 ఎకరాల ప్రభుత్వ భూమిని గ్రామంలోని కొందరు గత కొన్నేళ్లుగా సాగు చేసుకుంటున్నారు. ఈ క్రమంలో గ్రామస్తుల తాగునీటి అవసరాలను తీర్చేందుకు స్థానిక ప్రజా ప్రతినిధులు ప్రభుత్వ భూమిలో చెరువు తవ్వకానికి అధికారుల అనుమతులు తీసుకుని శంకుస్థాపన యత్నం చేశారు. దీన్ని గ్రామ టీడీపీ నాయకులతో పాటు కొందరు అడ్డుకున్నారు. విషయం తెలిసిన పోలీసులు సంఘటన స్థలికి చేరుకుని ప్రభుత్వ భూమిని తమదని చెబుతున్న వారిని పత్రాలు ఉంటే చూపాలని సూచించారు. ఆ తర్వాత రాతపూర్వకంగా ఫిర్యాదు చేయాలని సూచించారు. దీనిపై గ్రామంలోని ఇరువర్గాలు నల్లపాడు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదులు చేశారు.

వైభవంగా అద్దంకమ్మ తల్లి ఆలయ వార్షికోత్సవం



ప్రత్తిపాడు: నియోజకవర్గ కేంద్రం ప్రత్తిపాడులోని అద్దంకమ్మ తల్లి ఆలయ ఎనిమిదో వార్షికోత్సవం ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు అద్దంకమ్మ తల్లికి ప్రత్యేక పుష్పాలంకరణ చేశారు. అనంతరం విశేష పూజలు నిర్వహించారు. భక్తులు, మహిళలు అమ్మవారిని దర్శించుకుని హారతులందుకున్నారు. ఆలయ నిర్వాహకులు పెద్దఎత్తున ప్రసాద వితరణ చేశారు.

ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరానికి స్పందన



గుంటూరు రూరల్: ఆయుర్వేద వైద్యం ద్వారా దీర్ఘకాలిక వ్యాధులు త్వరితగతిన నయం అవుతాయని శ్రీ వేంకటేశ్వర ఆయుర్వేదిక్ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కొండా వెంకటేశ్వర్లు తెలిపారు. ఆదివారం నగర శివారుల్లోని ఇన్నర్ రింగ్ రోడ్డు సమీపంలోగల శ్రీ వేంకటేశ్వర ఆయుర్వేదిక్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ కొండా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పురాతన వైద్యాల్లో ఆయుర్వేదం ప్రఖ్యాతిగాంచినట్లు తెలిపారు. సైడ్ ఎఫెక్ట్స్ లేకుండా రోగులకు వైద్యం అందజేస్తున్నామని చెప్పారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో 100 పడకలతో సేవలు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. అనంతరం 250 మందికి పరీక్షలు నిర్వహించి, పలువురికి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పెనుమూడి కరుణాకర్, ఈదా సాంబిరెడ్డి, వైద్యులు డాక్టర్ ధనలక్ష్మి, డాక్టర్ సాయిగౌతమి, డాక్టర్ భానుకశ్యప్, డాక్టర్ హరికృష్ణ, డాక్టర్ శ్రావణ్, డాక్టర్ చరిష్మా, మేనేజర్ మల్లేశ్వరి పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలో ప్రతి కార్యకర్తకూ గుర్తింపు


మురళీకృష్ణ సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరిన నాయకులు

● పొన్నూరు సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ
● పెదకాకానిలో 75 మంది పార్టీలో చేరిక

పెదకాకాని: వైఎస్సార్ సీపీ విజయం కోసం పని చేసిన ప్రతి ఒక్కరికీ పార్టీలో తప్పక గుర్తింపు ఉంటుందని పొన్నూరు నియోజకవర్గ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ అన్నారు. పెదకాకాని మండలానికి చెందిన బీసీ, ఎస్సీ, ఎస్టీ నాయకులు, కార్యకర్తలు ఆదివారం ఆయన సమక్షంలో స్వగృహంలో జరిగిన కార్యక్రమంలో వైఎస్సార్ సీపీలో చేరారు. పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా అంబటి మురళీకృష్ణ మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా పరిపాలన సాగిస్తున్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో కార్యకర్తలు పెద్దఎత్తున చేరుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో బీసీ నాయకులు కుక్కల రాంప్రసాద్, ముడియాల మల్లికార్జునరెడ్డి, దానబోయిన సాంబయ్య, చింత కుమారస్వామి, మురికిపూడి చంద్రశేఖరరావు, దానబోయిన నాగేశ్వరరావు, గడ్డేశ్వరరావు, కారంకి వెంకటేశ్వరరావు, పాగోలు శ్రీనివాసరావు, శివనాగమల్లేశ్వరరావు, సుబ్బారావు, కారంకి మధు, దోసపాటి శ్రీకాంత్, నర్సిరెడ్డి పాల్గొన్నారు.

● నిస్వార్థ సేవ

ప్రత్తిపాడు: వలంటీర్లు నిస్వార్థ సేవ అందిస్తున్నారు. గ్రామం, నియోజకవర్గ, జిల్లా దాటి పొరుగు రాష్ట్రానికి వెళ్లి మరీ లబ్ధిదారులకు పింఛను అందజేస్తున్నారు. ప్రత్తిపాడుకు చెందిన బాపతు శ్రీనివాసరెడ్డి అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్‌లోని కిడ్నీ కేర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రత్తిపాడుకు చెందిన వలంటీరు గురుగూరి దుర్గ ఆదివారం అక్కడకు వెళ్లి చికిత్స చేయించుకుంటున్న శ్రీనివాసరెడ్డికి దివ్యాంగ పింఛను రూ. 3 వేలు అందజేసింది.


హైదరాబాద్ వెళ్లి పింఛను అందజేస్తున్న వలంటీరు దుర్గ

గ్రామాల్లో పోలీసుల కవాతు


పెదపలకలూరులో కవాతు నిర్వహిస్తున్న డీఎస్పీ మహబూబ్‌బాషా, సిబ్బంది


తక్కెళ్లపాడులో సీఐ వీరాస్వామి ఆధ్వర్యంలో కవాతు చేస్తున్న సీఆర్‌పీఎఫ్ పోలీసులు

గుంటూరు రూరల్: ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ప్రజా రక్షణ, శాంతి భద్రతల్ని కాపాడేందుకు ఆదివారం పలు గ్రామాల్లో పోలీస్ కవాతు నిర్వహించినట్లు సౌత్ జోన్ డీఎస్పీ మహబూబ్ బాషా తెలిపారు. గుంటూరు జిల్లా ఎస్పీ తుషార్ డూడీ ఆదేశాల మేరకు నల్లపాడు సీఐ సీహెచ్. రాంబాబు నేతృత్వంలో స్టేషన్ సిబ్బందితో పాటు కేంద్ర బలగాలు సీఐఎస్ఎఫ్ సిబ్బంది 100 మంది కలిసి మండలంలోని పెదపలకలూరు, చిన్న పలకలూరు, మల్లవరం, దాసుపాలెం, తోకవారిపాలెం గ్రామాల ప్రధాన వీధుల్లో కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ గ్రామాల్లో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యల్లో భాగంగా కవాతు నిర్వహించామని చెప్పారు.

పెదకాకానిలో..

గ్రామాల్లో శాంతిభద్రతలకు ఆటంకం కలిగిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని పెదకాకాని సీఐ కొమ్మనబోయిన నాగేశ్వరరావు హెచ్చరించారు. ఆదివారం ఆయన ఆధ్వర్యంలో మండలంలోని తక్కెళ్లపాడులో సిబ్బంది అడ్డ రోడ్డు నుంచి ఎస్టీ కాలనీ వరకు ప్రధాన రోడ్డులో కవాతు నిర్వహించారు. పోలింగ్ బూత్‌ల వద్ద వివాదాలకు పాల్పడినా, నిబంధలకు విరుద్ధంగా వ్యవహరించినా, పోలింగ్‌కు ఆటంకం కలిగించినా, నకిలీ ఓటు వేసేందుకు ప్రయత్నిస్తూ పట్టుబడినా కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ తెలిపారు. ప్రతి ఒక్కరూ ఓటు వేసి పోలింగ్ ప్రశాంతంగా జరిగేందుకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక ఎస్ఐలు నాగేంద్ర, ఎస్కే మీరజ్, స్థానిక పోలీసులు, సీఆర్‌పీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

రేషన్ బియ్యం స్వాధీనం

గుంటూరు ఈస్ట్: రేషన్ బియ్యం అక్రమంగా తరలిస్తున్న వ్యక్తిపై పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. శ్యామలానగర్‌లో ఓ వ్యక్తి అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తున్నారనే సమాచారం అందుకున్న పోలీసులు ఆదివారం దాడి చేశారు. పేరేచర్ల ప్రసాద్‌ను అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. అతని నుంచి 30క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేడు వైఎస్సార్ సీపీ ఆత్మీయ సమావేశాలు

పొన్నూరు: గుంటూరు పార్లమెంటు నియోజకవర్గ సమన్వయకర్త, పొన్నూరు ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య ఆధ్వర్యంలో సోమవారం నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ ఆత్మీయ సమావేశాలు నిర్వహించనున్నట్లు పార్టీ కార్యాలయ వర్గాలు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపాయి. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పొన్నూరు నియోజకవర్గ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ పాల్గొననున్నారు. ఉదయం 11 గంటల నుంచి పట్టణంలోని పార్టీ కార్యాలయంలో పట్టణ, రూరల్ నాయకులతో సమావేశం, సాయంత్రం 4 గంటలకు చేబ్రోలులోని పరిమి సత్యనారాయణ కల్యాణ మండపంలో, రాత్రి 7గంటలకు పెదకాకానిలోని శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి ఆలయం రోడ్డులోని యాగంటి అపార్ట్‌మెంట్ పక్కన సమావేశాలు జరుగుతాయని తెలియజేశారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.

మొహమ్మద్ తయ్యాబ్‌కు డాక్టరేట్



ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ పరిశోధకుడు షేక్ మహమ్మద్ తయ్యాబ్‌కు డాక్టరేట్ ప్రదానం చేసినట్లు రీసెర్చ్ సెల్ కోఆర్డినేటర్ పి. కిరణ్మయి తెలిపారు. ఆయన ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ పరిశోధనా పర్యవేక్షకుడు కె. చంద్రశేఖరరావు ఆధ్వర్యంలో ' కంట్రోల్ టెక్నిక్స్ ఫర్ పెర్ఫార్మెన్స్ ఇంప్రూవ్‌మెంట్ ఇన్ గాస్ ఇన్సులేటెడ్ స్విచ్‌గేర్స్ బై డైరెక్షన్ అండ్ మిటిగేషన్ ఆఫ్ పార్షియల్ డిస్‌ఛార్జెస్' అనే అంశంపై పరిశోధనా గ్రంథం సమర్పించినట్లు పేర్కొన్నారు.

విలువ జోడింపుతోనే రైతుకు ఆదాయం

హార్టీకల్చర్ డెప్యూటీ డైరెక్టర్ వి.ఎస్. ధర్మజ



గుంటూరు రూరల్: పంటలకు విలువల జోడింపుతో రైతులు మంచి ధరలు పొందవచ్చని హార్టీకల్చర్ డెప్యూటీ డైరెక్టర్ వి.ఎస్. ధర్మజ తెలిపారు. వట్టిచెరుకూరు మండలం పుల్లడిగుంట గ్రామంలోని రైతునేస్తం ఫౌండేషన్‌లో గత రెండు రోజులుగా జరుగుతున్న రైతులకు శిక్షణ ఆదివారంతో ముగిసింది. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రైతులు వ్యవసాయాన్ని ఆనందంగా కొనసాగించలేక పోతున్నారన్నారు. సాగు లాభాదాయకంగా కొనసాగాలంటే దిగుబడులకు విలువ జోడిస్తే సరైన మార్గమని తెలిపారు. సేంద్రియ పద్ధతిలో వరి, అపరాల పంటల సాగు, సేంద్రియ సాగులో ఉపయోగించే వివిధ రకాల కషాయాలు, ద్రావణాల వివరాలు, వాటి ఉపయోగాలు రైతు శివనాగమల్లేశ్వరరావు వివరించారు. జామ సాగురైతులు నెమటోడ్స్ సమస్యను ఎక్కువగా ఎదుర్కొంటున్నారని, దీనికి సేంద్రియ సాగే సరైన దారని రైతు శబరినాథ్ తన అనుభవాలను రైతులతో పంచుకున్నారు. బహుళ అంచెల సాగు గురించి ప్రకృతి రైతు ఏడుకొండలు తెలిపారు. వివిధ వ్యవసాయ ఉత్పత్తులకు విలువ జోడింపు, వివిధ యంత్ర పరికరాల వివరాలు, ధర, పనిచేసే విధానాలను రైతునేస్తం ఫౌండేషన్ చైర్మన్ యడ్లపల్లి వెంకటేశ్వరరావు పవర్ పాయింట్ ద్వారా వివరించారు. అనంతరం శిక్షణకు హాజరైన రైతులకు సర్టిఫికెట్లు అందజేశారు.

ప్రమాదంలో వ్యక్తి మృతిపై కేసు నమోదు

పట్నంబజార్: ప్రమాదంలో వ్యక్తి మృతిపై కేసు నమోదైంది. వెస్ట్ ట్రాఫిక్ మిర్చి యార్డులో కూలీగా పనిచేసే మస్తాన్‌వలీ(52) ఆదివారం లాలుపురం రోడ్డులోని కృష్ణబాబు కాలనీ మీదుగా వెళ్తున్న సమయంలో లారీ వచ్చి ఢీకొట్టింది. దీంతో ద్విచక్ర వాహనంపై వెళ్తున్న మస్తాన్‌వలీ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఇంటి నుంచి తప్పిపోయిన చిన్నారి


దీపిక

పట్నంబజార్: ఐదు సంవత్సరాల చిన్నారి ఇంటి నుంచి తప్పిపోయి పోలీసులకు దొరికిన సంఘటన గుంటూరు నగరంలో చోటు చేసుకుంది. కొత్తపేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం మధ్యాహ్నం నాజ్ సెంటర్ థియేటర్ వద్ద ఐదు సంవత్సరాల చిన్నారి ఏడుస్తూ తిరుగుతుండగా, పోలీసులు స్టేషన్‌కు తీసుకువచ్చి ఆరా తీశారు. అయితే తన పేరు దీపిక అని, తల్లి పేరు త్రివేణి అని మాత్రమే చెప్పగలుగుతోంది. చిన్నారికి సంబంధించిన పూర్తి వివరాలు తెలియలేదు. ఈ క్రమంలో ఆమెను శిశుసంక్షేమశాఖాధికారులకు అప్పచెప్పారు. చిన్నారి వివరాలు తెలిసిన వారు కొత్తపేట పీఎస్ ఎస్‌హెచ్‌వో షేక్ అన్వర్ బాషా (86888 31320)కు సమాచారం అందించాలి.